సాక్షి
వికారాబాద్


ఆదివారం । 5 మార్చి । 2023



డబుల్ అనుగ్రహమేది..!
ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం నిర్మించి ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అందని ద్రాక్షగానే మిగిలింది. 8లో▸



ఆటలు ఎలా..?
గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపట్టిన మైదానాల ఎంపికపై యువత అసహనం వ్యక్తంచేస్తోంది. 8లో▸



'మనఊరు.. మనబడి'
బడుల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మనఊరు- మనబడి పథకాన్ని తీసుకువచ్చింది. 9లో▸

న్యూస్‌రీల్

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం సూచించారు. సోమవారం సాయంత్రం 4:30 గంటలలోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో అప్లికేషన్ అందజేయాలని తెలిపారు. జనరల్ అభ్యర్థులైతే పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నీట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూ పద్ధతిలో నియామకం ఉంటుందని వెల్లడించారు.

ప్రహరీ నిర్మాణానికి వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం వెల్ఫేర్ సభ్యులు

ధారూరు: మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో విష సర్పాలు, పందులు, మేకలు, పశువులు సంచరిస్తున్నాయని ముస్లిం వెల్ఫేర్ మండల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ధారూరుకు వచ్చిన మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీరిలో బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, అబ్దుల్ రహీం ఖురేషీ, మొయినొద్దీన్, ఖుక్క అజీమ్,సల్మాన్ ఖురేషీ తదితరులు ఉన్నారు.

రేగడిమైలారం పాఠశాలలో డీఈఓ తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారం ఉన్నత పాఠశాలను శనివారం మధ్యాహ్నం డీఈఓ రేణుకాదేవి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. తొమ్మిదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. వారినుంచి వచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మల్లేశ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో పన్నులే కీలకం



రశీదు తీసుకుంటున్న మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: సకాలంలో పన్నులు చెల్లించి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తిర్మలాపూర్ గ్రామ పరిధిలోని తన స్వగృహానికి సంబంధించిన ఇంటి పన్ను బకాయిని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పన్నులు చెల్లిస్తేనే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంటుందన్నారు.

10 జీపీఏతో ప్రత్యేక గుర్తింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ

బొంరాస్‌పేట: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని గిరిజన సంక్షేమశాఖ కమిషనరేట్ జేడీ సత్యనాయరాయణ అన్నారు. మండల పరిధిలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 10 జీపీఏ సాధించే విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.50 వేల ఆర్థిక సాయంత అందుతుందని తెలిపారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి కోటాజీ, ప్రిన్సిపాల్ విక్రమ్ రాథోడ్, రాజన్న, శరణప్ప తదితరులు ఉన్నారు.

పచ్చదనానికి మచ్చ!

పరిగి నుంచి హైదరాబాద్ వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన వెంచర్‌లోని పార్కు ఇది. దీని చుట్టూ వెంచర్ల నిర్వాహకులు నిర్మాణాలు చేపట్టగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో హరితహారం కింద మూడుసార్లు మొక్కలు నాటారు. ఇందుకోసం గ్రీన్ బడ్జెట్ నుంచి నిధులు ఖర్చు చేశారు. మొదట్లో నాటిన మొక్కలకు గార్డులు సైతం అమర్చారు. కానీ ఏనాడూ నీళ్లు పోసిన పాపాన పోలేదు. దీంతో నాటిన వందశాతం మొక్కలు ఎండిపోయాయి. కొద్ది రోజులకే పార్కు మొత్తం గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయి బీడు భూమిగా మారింది. జిల్లాలోని పార్కుల దుస్థితికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే.



పరిగి- హైదరాబాద్ వెళ్లే దారిలో ఉన్న వెంచర్‌లో ఏర్పాటు చేసిన పార్కులో పూర్తిగా ఎండిపోయిన మొక్కలు

పక్కదారి పడుతున్న గ్రీన్ బడ్జెట్ నిధులు

- మున్సిపాలిటీల్లో పార్కుల పరిస్థితి అధ్వానం
- ఎండిన మొక్కలు.. ఏపుగా పెరిగిన గడ్డి
- పచ్చదనం కరువైన పార్కులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మున్సిపాలిటీల్లో పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. గ్రీన్ బడ్జెట్ కింద ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై నిధులు స్వాహా చేస్తున్నారని పాలక సభ్యులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. – వికారాబాద్

- జిల్లాలోని సగానికిపైగా పార్కుల పరిస్థితి అధ్వానంగా మారింది.
- మున్సిపాలిటీల్లోని పార్కుల్లో నాటిన మొక్కల్లో ఎనభై శాతానికి పైగా బతికాయని అధికారులు చెబుతుండగా ఎక్కడా ఆ దాఖలాలు కనిపించడం లేదు.
- సంబంధిత అధికారులు మొక్కల పర్యవేక్షణ, పార్కుల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు.
- ప్రస్తుతం పార్కులన్నీ గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.
- జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనభై పార్కులు ఉండగా.. ఒక్కో మున్సిపాలిటీలో 10 నుంచి 30 పార్కులు ఉన్నాయి. ఒక్కో పార్కు అభివృద్ధి, పచ్చదనం పెంపు కోసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు.
- వీటన్నింటిలో హరితహారం కింద మొక్కలు నాటారు.
- గ్రీన్ బడ్జెట్ నిధులు మంచు గడ్డలా కరిగిపోతున్నా పార్కుల్లో అభివృద్ధి, పచ్చదనం మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు.
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్లపై పలుసార్లు కలెక్టర్ వరకు ఫిర్యాదులు వెళ్లాయి.
- మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో ప్రతిపక్ష కౌన్సిలర్లు పలుసార్లు నిలదీసినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు.

గ్రీన్ బడ్జెట్ పక్కదారి

- మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన గ్రీన్ బడ్జెట్ పక్కదారి పడుతోంది.
- ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో వార్షిక బడ్జెట్‌లో 10శాతం నిధులను గ్రీన్ బడ్జెట్ కింద కేటాయిస్తారు.
- ఈ డబ్బులతో మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటడం, సంరక్షణ, పార్కుల నిర్వహణ తదితర అంశాలకు ఖర్చు చేస్తారు.
- జిల్లాకు చెందిన ఒక్కో మున్సిపాలిటీలో రూ.6 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు వార్షిక బడ్జెట్ ఉండగా ఇందులో పది శాతం నిధులను గ్రీనరీ కోసం ఖర్చు చేస్తారు.
- ఈ లెక్కన ఒక్కో మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం కోసం రూ.50 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు ఖర్చు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.
- అయితే వాస్తవంగా ఈ నిధుల్లో యాభై శాతం కూడా వెచ్చించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ట్రీ గార్డులు, నీటి సరఫరా, సంరక్షణ తదితర పేర్లతో బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేస్తున్నారు.
- కొన్నిచోట్ల వెంచర్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన పార్కులకు సంబంధించి కూడా కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ల అండదండలతో నిధులు బొక్కేశారనే ఆరోపణలున్నాయి.
- మున్సిపాలిటీల్లో పచ్చదనం అభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ మాత్రం కరువైంది.
- హరితహారం మొక్కలు నాటే సమయంలో హడావుడి చేస్తున్న జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు మళ్లీ అటువైపు తిరిగి చూడటం లేదు.

డయాలసిస్‌కు మోక్షం

- కొడంగల్ సివిల్ ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్న సేవలు
- రేపు అధికారికంగా సెంటర్ ప్రారంభం
- రక్తశుద్ధి మిషన్లు, జనరేటర్ సిద్ధం
- 'సాక్షి' కథనాలతో స్పందించిన యంత్రాంగం, ప్రజాప్రతినిధులు

సాక్షి ఎఫెక్ట్..



ప్రారంభానికి సిద్ధంగా రక్తశుద్ధి యంత్రాలు

కొడంగల్: పట్టణంలోని పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రక్త శుద్ధి చేసేందుకు అవసరమైన యంత్రాలను బిగించారు. ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్ ద్వారా రోగులకు చికిత్సలు అందడం లేదంటూ 'సాక్షి' ప్రచురితమైన వరుస కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతో రక్త శుద్ధి యంత్రాలు, జనరేటర్, బెడ్లు ఏర్పాటు చేశారు. సోమవారం అధికారికంగా సెంటర్‌ను ప్రారంభించనున్నారు.

తీరనున్న కష్టాలు

కొడంగల్ సివిల్ ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ దవాఖాన జిల్లా వైద్యాధికారి ఆధీనంలో ఉండేది. అప్‌గ్రేడ్ తర్వాత తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లింది. గతేడాది జూన్ 16న వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతులమీదుగా ఇక్కడ డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆరు మిషన్లతో రక్త శుద్ధి సెంటర్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తామని మంత్రి ప్రకటించారు. కానీ తొమ్మిది నెలలు దాటినా అందుబాటులోకి రాలేదు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న అనేక మంది రోగులు ఉన్నారు.వీరు వారానికి రెండు సార్లు రక్తశుద్ధి చేయించుకోవాలి. కొడంగల్‌లో సెంటర్ అందుబాటులోకి రాకపోవడంతో తాండూరు, మహబూబ్‌నగర్‌కు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొడంగల్‌లోని సెంటర్ అందుబాటులోకి వస్తే వీరి సమస్యలు తీరుతాయి.

ధరల పాపం మోదీదే

- గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లను ఇష్టానుసారంగా పెంచారు
- అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారు
- పాలమూరు- రంగారెడ్డితో త్వరలోనే సాగు, తాగునీరు
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి
- పేదలకు ఇళ్ల స్థలాలు, రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడి



ధారూరులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

ధారూరు: ఒక్క అబద్ధాన్ని.. పదేపదే నిజమని చెబుతున్న ప్రతిపక్షాలు ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వీరి కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే శ్రమించాలని పిలుపునిచ్చారు. రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200 చేసిన పాపం మోదీ సర్కారుదేనని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో ఎమ్మెల్యే అభ్యర్థికి టికెట్ రావాలంటే పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతిపాదించాలని, అలాంటప్పుడు ఆ పదవిలో కొనసాగుతున్న స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌కు టికెట్ ఎందుకు రాదో..? ఆరోపణలు చేస్తున్న వారే చెప్పాలని ఎద్దేవా చేశారు. పార్టీలో గందరగోళం సృష్టించేందుకు కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఇల్లు కట్టుకునే వారికి స్థలంతో పాటు రూ.3 లక్షల సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగు, తాగునీరు అందుతుందని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ పేదల జేబులు, కడుపులు నింపుతుంటే మోదీ సర్కారు మాత్రం జేబులు ఖాళీ చేస్తూ కడుపులు మాడుస్తోందని మండిపడ్డారు. ధారూరులో ఓ పరిశ్రమను ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతకు ఉపాధి చూపుతామని తెలిపారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు.

కాంగ్రెస్ పనైపోయింది

కాంగ్రెస్ పనైపోయిందని, కేంద్రంలో, రాష్ట్రంలో ఆ పార్టీకి ఆదరణ కరువైందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బీజేపీ నేతలు మతోన్మాద వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మసీదులు తవ్వుతామని, హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మారుస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటనలు చేయడం విడ్డూరమన్నారు. జిల్లాలో గ్రామ అంచనా తయారు చేసి సమన్వయ కమిటీలను నియమించాలని తెలిపారు. ప్రతీ వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించాలని సూచించారు. అంతకు ముందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కారంజీ వీరేశం ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, జెడ్పీటీసీ కొస్నం సుజాత, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నేతలు సంతోష్, ఎ.అంజయ్య, కావలి అంజయ్య, వెంకటయ్య, ఇస్మాయిల్, బాల్‌రాజ్‌నాయక్, సర్పంచులు విశాల, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతి వర్గం దూరం

ధారూరులో మంత్రి సబితారెడ్డి సమక్షంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి అసమ్మతి వర్గం హాజరు కాలేదు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయకుమార్, ధారూరు, హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్లు సత్యనారాయణరెడ్డి, వెంకటర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పి.బసప్పతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ మీటింగ్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. అసంతృప్తి కారణంగానే తాను సమ్మేళనానికి రాలేదని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ పేర్కొనడం గమనార్హం.

బాలుడి మృతితో ఉద్రిక్తత

- కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన మూడో తరగతి చిన్నారి కన్నుమూత
- హాస్టల్‌లోని మంచంపై నుంచి పడ్డాడని చెబుతున్న యాజమాన్యం
- టీచర్లే కొట్టారని తల్లిదండ్రుల ఆరోపణ
- సమగ్ర విచారణకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదేశం



విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరామయ్య



కార్తీక్ (ఫైల్)

పూడూరు: మండల పరిధిలోని కేశవరెడ్డి పాఠశాలకు చెందిన మూడో తరగతి బాలుడు కె.కార్తీక్ (8) అనుమానాస్పద మృతి ఉద్రిక్తతకు దారితీసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిన్నమంగళారానికి చెందిన కె. ప్రవీణ్ కుమారుడు కార్తీక్ గత నెల 27న హాస్టల్ మంచంపై నుంచి కింద పడిపోయాడంటూ స్కూల్ యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు వచ్చి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. టీచర్లు కొట్టడంతోనే చనిపోయాడని, తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కార్తీక్ తల్లిదండ్రులు ఆరోపించారు. చన్గోముల్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఈ ఘటనపై విచారణ జరిపారు. అయితే స్కూలు ప్రధాన గేటుకు తాళం వేసి విచారణ చేయడం ఏమిటంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. పాఠశాల లోపలికి చొచ్చుకునిపోయేందుకు యత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య పాఠశాలకు చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. డీఈఓ రేణుకాదేవి పాఠశాలను సందర్శించారు. విచారణలో స్కూలు నిర్వాహకులది తప్పని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్తీక్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని పాఠశాల విద్యా డైరెక్టర్ శ్రీదేవసేనను మంత్రి సబితారెడ్డి ఆదేశించారు.



స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉన్నతాధికారులు



స్టీల్ బ్రిడ్జి.. నగరానికే తలమానికం

- పనులను పరిశీలించిన మంత్రి కేటీఆర్
- నత్తనడకన సాగడంపై అసంతృప్తి
- జూన్ 2లోగా పూర్తి చేయాలని ఆదేశం

ముషీరాబాద్: ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ వరకు 2.6 కిలోమీటర్ల మేర రూ.440 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎలివేటెడ్ స్టీల్ బ్రిడ్జి నగరానికే తలమానికం కానుందని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి స్టీల్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. పనులు నత్త నడకన సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అవసరమైతే రాత్రింబవళ్లు పని చేయాలని కేటీఆర్ సూచించారు. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి కొద్ది దూరం నడుచుకుంటూ వచ్చి పనులను పరిశీలించారు. అనంతరం వీఎస్టీ వద్ద నిర్మితమవుతున్న ర్యాంప్ పైకి ఎక్కి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్‌ను తగ్గించి ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల ప్రజల సౌకర్యార్థం స్టీల్ బ్రిడ్జిని చేపడుతున్నామని తెలిపారు. నగర పౌరులకు ట్రాఫిక్ రద్దీ సమస్యకు ఉపశమనం లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన..

స్టీల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఎస్ఎన్‌డీపీలో భాగంగా చేపట్టిన హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ పనులను మంత్రి కేటీఆర్ సమీక్షించారు. హుస్సేన్‌సాగర్ వరద నీటి ద్వారా లోతట్టు ప్రాంత ప్రజలకు భవిష్యత్తులో ముంపు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం చిక్కడపల్లిలోని కూరగాయాల మార్కెట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. చేపల మార్కెట్ కోసం డిజైన్ రూపొందించండి.. దేశంలోనే ఫ్రెష్ ఫిష్ మార్కెట్ ఎక్కడ ఉందంటే రాంనగర్‌లోనే ఉందనే విధంగా చేపల మార్కెట్‌ను మంచి డిజైన్ చేసి వారం రోజుల్లో తీసుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహకు మంత్రి కేటీఆర్ బాధ్యతలను అప్పగించారు. జాగా నేను ఇప్పిస్తా.. డబ్బులు ఇప్పిస్తా వారం రోజుల్లో డిజైన్ చేసి తీసుకురా అని జైసింహతో చెప్పారు. ఈఎన్సీలు శ్రీధర్, జియావుద్దీన్, సీఈ దేవానంద్, ఎస్ఈ అనిల్‌రాజ్, ఈఈ శ్రీనివాస్,గోపాల్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్‌ సమస్యలపై 'ప్రజావాణి' రేపు

తాండూరు టౌన్‌: తాండూరు మున్సిపల్‌ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్‌ డే) నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్‌ కమిషనర్‌ అశోక్‌ కుమార్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనున్న కార్యక్రమంలో పట్టణ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, విద్యుత్‌ దీపాలు, టౌన్‌ ప్లానింగ్‌, ఆసరా పింఛన్లు, జనన, మరణ సర్టిఫికెట్‌ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్‌ విభాగం పరిధిలోని రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై మాత్రం ఫిర్యాదులు స్వీకరించమని తెలిపారు.

అక్రమ వెంచర్లపై కొరడా



హద్దురాళ్లను తొలగిస్తున్న అధికారులు

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా విస్తరించిన వెంచర్లపై అధికారులు కొరడా ఝులిపించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఓ వెంచర్‌ ఏర్పాటు చేశారు. హద్దురాళ్లను ఏర్పాటు చేసి లేఅవుట్‌గా చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీఓ రవీందర్‌, పంచాయతీ కార్యదర్శి ఆనందం శనివారం ఆ హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్‌లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాండ్‌ కన్వర్షన్‌ చేసుకుని అన్ని అనుమతులు వచ్చాకే ప్లాట్లను విక్రయించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్‌ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి అనంతసాగర్‌ గ్రామ పరిధిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ పోలీసులు గమనించారు. అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గిరి తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే బిల్లులు నిలిపివేస్తాం

పంచాయతీరాజ్‌ ఏఈ నందిని



అంతారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ నందిని

తాండూరు రూరల్‌: ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ కింద గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్‌ ఏఈ నందిని సూచించారు. శనివారం ఆమె మండల పరిధిలోని అంతారం గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ నెల 15లోపు అన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



కల్యాణోత్సవంలో తాలిబొట్టు చూపుతున్న అర్చకుడు

వైభవంగా బసవేశ్వర కల్యాణం

చౌడాపూర్‌ మండల పరిధిలోని కోటచింతల బసవేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మరికల్‌–కిష్టంపల్లి గ్రామాల పరిధిలోని బసవేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున అగ్నిగుండాలు, మధ్యాహ్నం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు జయజయ ధ్వనులతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. – కుల్కచర్ల



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

డబుల్‌ అనుగృహమేది..!

పేదలకు ప్రభుత్వ ఖర్చుతోనే డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం వారి ఆశలకు రెక్కలు తొడిగింది. ఆరేళ్ల కిందట ప్రారంభించిన పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. దీంతో పేదలకు గూడు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- ఆరేళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బంది పడుతున్న పేదలు



మోమిన్‌పేటలో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వాలు చిన్న ఇళ్ల కోసం తక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నాయని.. ప్రత్యేక రాష్ట్రంలో ఎంత ఖర్చైనా ప్రభుత్వమే భరించి డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తుందని చెప్పారు. వాస్తవ రూపంలో కొన్ని ఇళ్లు మాత్రమే మంజూరు చేసినా.. అవి పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో పునాదులే తీయలేదు. దీంతో ఇళ్లు లేని పేదలు నిరాశకు లోనవుతున్నారు. మండల పరిధిలోని మూడు గ్రామాల్లో డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. మోమిన్‌పేట, మొరంగపల్లి, టేకులపల్లి గ్రామాల్లో 210 ఇళ్లను నిర్మించేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. మోమిన్‌పేటలో 140, టేకులపల్లిలో 30, మొరంగపల్లిలో 20 ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించారు. ఆరేళ్ల క్రితం అప్పటి రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మోమిన్‌పేట, టేకులపల్లిలో భూమి పూజ చేశారు. కానీ టేకులపల్లిలో పునాదులు కూడ పడలేదు. మోమిన్‌పేటలో రెండేళ్ల క్రితం పునాదులు వేసి ప్రస్తుతం పిల్లర్ల దశలో పనులు నిలిచి పోయాయి. ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్‌ రెండు సార్లు నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరు నెలలు గడుస్తున్నా పనులలో పురోగతి కనిపించలేదు. కాంట్రాక్టరు గిట్టుబాటు అవడం లేదని పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు సమాచారం. టెండర్‌ దక్కించుకున్న కాంట్రాక్టర్‌ పనులను ఎప్పుడు పునః ప్రారంభిస్తాడో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. డబుల్‌ బెడ్రూం ఇళ్లు వస్తాయని ఎదురు చూసిన మా ఆశలు అడియాశలుగానే మిగిలాయని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని డబుల్‌ ఇళ్లు నిర్మిస్తామని చెప్పింది. నాటి నుంచి దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నాం. ఆరేళ్లుగా వేచి చూడగా రెండేళ్ల క్రితం ప్రారంభించారు. పిల్లర్లు వేసి వదిలేశారు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో.. ఎప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదు.

– శేఖర్‌, మోమిన్‌పేట

త్వరలోనే పనుల ప్రారంభం

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ సబ్‌ కాంట్రాక్టర్‌ పనులు అప్పగించారు. గిట్టుబాటు అవ్వడం లేదని సబ్‌ కాంట్రాక్టర్‌ మధు మధ్యలోనే వదిలేశారు. ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– శ్రీనివాస్‌, ఇరిగేషన్‌ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌, మోమిన్‌పేట

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

డీపీఓ తరుణ్‌కుమార్‌



యూజీడీ పనులను పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్‌

కుల్కచర్ల: అధికారులు తమ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) తరుణ్‌ కుమార్‌ అన్నారు. శనివారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా మొదటగా పంచాయతీ భవనాన్ని పరిశీలించి క్యాష్‌ బుక్‌లో ఎంట్రీలు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు? రిజిస్టర్లు నిర్వాహన సక్రమంగా ఉండాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి విత్తనాల మొలకెత్తకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. బండరాళ్లపై మొక్కల పేర్లు రాయడం సరికానది అట్టముక్కలపై వ్రాయాలని పనితీరు మార్చుకోవాలని సూచించారు. అనంతరం డంపింగ్‌ యార్డు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పల్లె ప్రకృతి వనం, క్రిమిటోరియాన్ని పరిశీలించి విధుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించేదిలేదన్నారు. ఈనెల 15వరకు లోపాలు సరిచేసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, సర్పంచ్‌ మైపాల్‌ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుమలత, శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఏడుగురికి బోధన



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్‌ అనిత

- విద్యార్థులు లేక వెలవెలబోతున్న మంతన్‌గౌడ్‌ ప్రాథమిక పాఠశాల
- విలీనాన్ని వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

బషీరాబాద్‌: మండల పరిధిలోని మంతన్‌గౌడ్‌ గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయురాలు, ఏడుగురు విద్యార్థులున్నారు. ఒకటి, మూడు తరగతుల్లో అసలు విద్యార్థులే లేరు. 2,4,5 తరగతుల్లో మొత్తం ఏడుగురు విద్యార్థులుండగా వీరిని ఒకే చోట కూర్చోబెట్టి ఉపాధ్యాయురాలు అనిత విద్యా బోధన చేస్తోంది. గ్రామంలో 98 కుటుంబాలు, మంతన్‌గౌడ్‌ తండా సమీపంలో 48 కుటుంబాలుంటాయి. వీరంతా తండాలోని ప్రాథమికోన్నత పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో మంతన్‌గౌడ్‌ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక వెలవెలబోతోంది. ఇదే విషయమై ఉపాధ్యాయురాలిని ప్రశ్నించగా పక్క ఊరి పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు చక్కగా చదువుకుంటారని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లాం. వారు అంగీకరించినా గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో పాఠశాల కొనసాగిస్తున్నామన్నారు.

జాతీయ క్రీడాకారుడి బలవన్మరణం

కుమారుడి ఆత్మహత్యపై తండ్రి అనుమానం



నరేష్‌ (ఫైల్‌)

కుల్కచర్ల: జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు, డిగ్రీ విద్యార్థి జంబుల నరేష్‌(18) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చౌడాపూర్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నవాబ్‌పేట్‌ పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జంబుల వెంకటయ్య దంపతులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు వ్యవసాయం చేస్తుండగా.. నరేశ్‌ మహబూబ్‌నగర్‌ ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం బయటకు వెళ్లిన సోదరుడు వచ్చి చూసేవరకు నరేశ్‌ ఉరేసుకున్నాడు. గమనించిన ఆయన చుట్టు పక్కల వారి సాయంతో మృతదేహాన్ని కిందికి దించి తండ్రికి సమాచారం ఇచ్చాడు. కాగా మృతుడి తండ్రి వారం రోజులుగా తమ కుమారుడు మానసికంగా బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారని.. ఆయన మృతిపై అనుమానం ఉందని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. మృతుడు కళాశాల నుంచి, వివిధ ఏజెన్సీల నుంచి కబడ్డీ పోటీలో జాతీయ స్థాయిలో రాణించాడు. అందరితో స్నేహపూర్వకంగా ఉండే నరేశ్‌ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కళ్లను రామాలయ ఐ కేర్‌కు అందజేశారు.

గుట్టల్లో ఆటలు ఎలా..?

- రాళ్లు, ముళ్ల పొదలతో క్రీడా ప్రాంగణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



కాశీంపూర్‌ క్రీడాప్రాంగణం దుస్థితి

బషీరాబాద్‌: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు సంకల్పించింది. వీటి అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసింది. మండల పరిధిలోని కాశీంపూర్‌ పంచాయతీలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. దీంతో రెవెన్యూ అధికారులు రైతువేదిక సమీపంలో ఎకరం భూమిని గ్రామీణ క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. అందులో గుట్టలు, రాళ్లతో పాటు ముళ్లకంప ఉన్నాయి. అందులోనే బోర్డుపాతి, స్తంభాలు ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం ఇలా ఉంటే ఆటలెలా ఆడాలని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు మండలంలో 36 పంచాయతీలకు గాను 21 పంచాయతీల్లోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మరో 12 పంచాయతీలలో ఫారెస్టు భూములు కేటాయించాలని రెవెన్యూ శాఖకు విజ్ఞప్తి చేశారు. అలాగే మరో మూడు పంచాయతీల్లో ప్రభుత్వ, అటవీ భూములు కూడా లేవని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



నైపుణ్య పరీక్షల్లో పాల్గొన్న యువకులు

అనంతగిరి: మత్స్యసహకార సంఘాల్లో నూతనంగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా మత్స్యశాఖ క్షేత్రస్థాయి అధికారి మునీందర్‌ తెలిపారు. వికారాబాద్‌ మండలంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో మత్స్యసహకార సంఘంలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. 121 మందికి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు హన్మంతు, సహకార సంఘం చైర్మన్‌ లక్ష్మయ్య, మాజీ చైర్మన్‌ ఆంజనేయులు, సంఘం సభ్యులు ఉన్నారు.

బాంబ్‌, డాగ్‌ స్క్వాడ్‌ తనిఖీలు

తాండూరు టౌన్‌: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బాంబ్‌ అండ్‌ డాగ్‌ స్క్వాడ్‌ తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌, రైల్వే స్టేషన్లతో పాటు పలు కల్వర్టులు, ప్రార్థన మందిరాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, తనిఖీలను చేపట్టామని, అనుమానిత వ్యక్తులు కానీ, పదార్థాలు కానీ కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్క్వాడ్‌ సభ్యులు తెలిపారు.

వేరుశనగ రైతుల కన్నెర్ర



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న వేరుశనగ రైతులు

- మార్కెట్‌ కమిటీ, దళారులు కుమ్మక్కయ్యారని రోడ్డెక్కిన అన్నదాతలు
- ఐదు గంటల పాటు ఆందోళన

పరిగి: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే దళారులు, మార్కెట్‌ కమిటీ కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని వేరుశనగ రైతులు ఆందోళనకు దిగారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్‌ యార్డులో పరిగి పరిసర మండలాల, గ్రామాల రైతులు ప్రతీ శుక్రవారం పంటను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. వేరుశనగ పంట భారీగా మార్కెట్‌కు తీసుకురావడంతో దళారులు బీట్లు వేయకుండా కాలయాపన చేశారు. శనివారం ఉదయం బీట్లు ప్రారంభించారు. అంతకు ముందు క్వింటాల్‌కు రూ.7,500 నుంచి రూ.8వేల వరకు పలికిన ధర ఒక్కసారిగా రూ.5వేలు పలకడంతో రైతులు ఆందోళన చెందారు. దళారులంతా ఏకమై రైతులను దోచుకునేందుకు ఇష్టానుసారంగా రేట్లు తగ్గించారని ఆగ్రహించారు. వెంటనే మార్కెట్‌ కార్యాలయంలో అధికారులను నిలయదీశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో బీజాపూర్‌–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. మార్కెట్‌ కమిటీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే దళారులు, వ్యాపారుస్తులు ఏకమై రైతులను మోసం చేస్తున్నారని మండి పడ్డారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ నాయకుడు మిట్ట పరమేశ్వర్‌ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింహ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌ కృష్ణ రైతుల ఆందోళనకు మద్దతు పలికారు. దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. దీంతో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌ రైతులతో మాట్లాడి న్యాయం చేస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు రైతులతో మాట్లాడి మార్కెట్‌ కమిటీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టాలని కోరడంతో రైతులంతా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జిల్లా మార్కెట్‌ కమిటీ అధికారి ఘటనా స్థలికి చేరకుని రైతులతో మాట్లాడారు. రైతులకు అన్యాయం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

లైసెన్స్‌ రద్దు చేయండి

మార్కెట్‌ కమిటీ చట్టం ప్రకారం రైతు విక్రయించిన పంటపై క్వింటాల్‌కు రూ.2కు బదులుగా రూ.4 కమీషన్‌ తీసుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ కమీషన్‌ తీసుకుంటున్న ఏజెంట్ల లైసెన్స్‌లు రద్దు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. బొంరాస్‌పేట్‌ మండలం బురాన్‌పూర్‌ గ్రామానికి చెందిన శివ 78 బ్యాగుల వేరుశనగను ఈశ్వరప్ప ట్రేడర్స్‌లో విక్రయించగా రూ.4 కమీషన్‌ను తీసుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

ఆఫీసులు శుభ్రంగా ఉండాలి

- ఆవరణలు పార్కులను తలపించాలి
- అధికారులకు కలెక్టర్‌ నారాయణరెడ్డి ఆదేశం
- తాండూరులో ధరణి హెల్ప్‌ డెస్క్‌ ప్రారంభం



ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను కలియతిరుగుతున్న కలెక్టర్‌ నారాయణరెడ్డి

తాండూరు రూరల్‌: ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్‌ నారాయణరెడ్డి ఆదేశించారు. తాండూరు మండల పరిషత్‌ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆఫీసు ఆవరణ చెత్తాచెదారంతో ఉండటాన్ని గమనించారు. తహసీల్దార్‌ చిన్న అప్పలనాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డిపై అసహనం వ్యక్తంచేశారు. పదిహేను రోజుల తర్వాత తాను మళ్లీ వస్తానని, అప్పటిలోపు వాతావరణం పూర్తిగా మారాలని తెలిపారు. కోకట్‌ పరిధిలోని మనోహర టౌన్‌షిప్‌లోని రాజీవ్‌ స్వగృహలో 14 ఓపెన్‌ ప్లాట్లు, 54 వివిధ దశల్లో ఉన్న గృహాలకు నిర్వహించే.. వేలం పాటలో పాల్గొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్‌ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అయితే ప్లాట్ల ధర గజం రూ.10 వేలు ఎక్కువ అవుతోందని రూ.5 వేలుగా నిర్ణయిస్తే కొనుగోలుదారులు ముందుకు వస్తారని కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఈనెల 10న మరోసారి సమావేశం ఏర్పాటు చేసి 17న వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు.

కొందరి కారణంగా చెడ్డ పేరు

కొంతమంది అధికారులు, ఉద్యోగుల కారణంగా ధరణి పోర్టల్‌కు చెడ్డపేరు వస్తోందని కలెక్టర్‌ అన్నారు. వెబ్‌సైట్‌ నిర్వహణపై అవగాహన లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధరణి హెల్ప్‌ డెస్క్‌ను పరిశీలించారు. ధరణి ద్వారా రైతుల సమస్యలను 99శాతం పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్‌ సంచిత్‌ గంగ్వార్‌, ఆర్డీఓ అశోక్‌కుమార్‌, డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

విధుల్లో నిమగ్నం

కలెక్టర్‌ వస్తున్నారని తెలియడంతో ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఎక్కడికక్కడే విధుల్లో నిమగ్నమయ్యారు. కలెక్టర్‌ ఏ క్షణం ఎక్కడకు వస్తారోనని తెలియక హడలిపోయారు. గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కొత్త కలెక్టర్‌ రాకతో ఉద్యోగులు, అధికారులు బాధ్యతగా పనిచేస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

అవ్వా.. పెడ్తరా బువ్వ?

తాండూరు మండలం నారాయణపూర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు తన వారసులకు భూమి రిజిస్ట్రేషన్‌ చేసేందుకు తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చింది. ఆమెను పలకరించిన కలెక్టర్‌.. ×అవ్వా నీ పేరు మీద ఉన్న భూమిని నీ వారసులకు చేయిస్తున్నావా..? భూమి రాసిస్తే నీకు బువ్వ పెడ్తారా..? అని అడగటంతో.. నమ్మకం ఉండటంతోనే తన మనవళ్ల పేరున చేయిస్తున్నానని వృద్ధురాలు చెప్పింది.



వృద్ధురాలు దుర్గమ్మతో ఆప్యాయంగా మాట్లాడుతున్న కలెక్టర్‌ నారాయణరెడ్డి